

వెదురుమూడిలో ఉపాధి గ్రామసభ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని వెదురుమూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చోడే రామ తులసి అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామసభలో ఎస్ఆర్పిఇ కనకారావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిఆర్పి కోటయ్య గ్రామంలో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాల నివేదికను సభలో వివరించారు . ఈ ఉపాధి హామీ గ్రామ సభలో ఎంపిపి గుణ్ణం భాను ప్రసాద్, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ రవికిరణ్, జెఇ పి.రజిత్ సింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ బి.సత్తిబాబు, ఉపాధి కూలీలు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టేదెలా..?

- భారంగా నిర్మాణ సామగ్రి ధరలు
- రెండు గదులు, హాలుతో ఇంటి నిర్మాణానికి రూ.25 లక్షలపైనే
- హడలిపోతున్న సామాన్యులు
- నిలిచిపోతున్న వ్యక్తిగత నిర్మాణాలు



నిర్మాణంలో ఉన్న ఇల్లు

ప్రజాశక్తి - రాజోలు

సామాన్య ప్రజానీకానికి సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యులు ఇల్లు కట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం రెండు పడక గదులు, హాలు, వంటగది ఉన్న ఇంటి నిర్మాణం చేయాలంటే రూ.25 లక్షలుపైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటి నిర్మాణంవైపు ఆలోచించాలంటేనే సామాన్య ప్రజానీకం వణికిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయానికి, అయ్యే ఖర్చుకు పొంతన లేకపోవడంతో ఇంటి నిర్మాణంవైపు సామాన్యులు ఆలోచించడం వదులుకుంటున్నారు. అత్యధికం మంది సొంతిల్లు నిర్మాణాలను వేసవిలో ఎక్కువ చేపడతారు. వాతావరణం అనుకూలంగా ఉంటుందని ఆలోచన చేస్తారు.

ఈ ఏడాది ప్రారంభం నుంచి కొత్త ఇంటి నిర్మాణాలు పెద్దగా సాగడం లేదని తాపీపనివారు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఒక్కటే. సామాన్యులు భరించలేని స్థితికి నిర్మాణ వ్యయం పెరిగింది. ప్రభుత్వం జిల్లాలో లక్షకుపైగా ఇంటిస్థలాలు ఇచ్చినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసేందుకు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం నిర్మాణ వ్యయమే. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పడక గదులు, హాల్, వంటగది తరహా ఇంటి నిర్మాణం చేయాలని సామాన్య ప్రజానీకం ఆలోచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టన్ను ఐరన్ ధర రూ.66 వేలు పలుకుతోంది. ఇసుక ఆరు యూనిట్లు లారీ ధర రూ.27,000 ఉంది. వెయ్యి ఇటుక ధర రూ.6 వేలు, సిమెంట్ బస్తా ధర రూ.290 కు చేరింది. ఇల్లు నిర్మించడానికి తాపీపని వారి ఖర్చు రూ.ఆరు లక్షల వరకూ అవుతోంది. ఇవికాకుండా గుమ్మాలు, కిటికీలు, విద్యుత్ సామాన్లు, ఇతర ఖర్చులు తడిసి మోపె డవుతు న్నాయి..ప్రభుత్వం ఇచ్చే సాయం ఏ మాత్రం అందడం లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి దిగితే అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో కష్టపడి కట్టిన ఇంటిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. ఇంటి నిర్మాణానికి బ్యాంకులు హౌసింగ్ లోన్లు ఇస్తున్నాయి. అయితే ప్రాసెసింగ్ ఫీజుల రూపంలో రూ.25 వేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యవసాయ పనులు చేసుకునే సామాన్య ప్రజానీకం ప్రతినెలా బ్యాంకులకు ఇఎంఐలు కట్టడం కష్టతరమైన పని కావడంతో సామాన్యుల భయపడుతున్నారు.

సొంతిల్లు కట్టుకునే పరిస్థితి లేదు

భూముల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు సెంటు భూమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సొంతిల్లు సైతం కట్టుకోలేని పరిస్థితి నెలకొంది. సామాన్య ప్రజానీకం రూ.20 లక్షలు ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణం చేయడం ఏమాత్రం సాధ్యంకాని పరిస్థితిగా మారిపోయింది. దీంతో చాలామంది ఇప్పటికే ఉన్న చిన్నపాటి ఇంటిలోనే కాలం గడుపుతుండగా, అద్దె ఇంట్లో ఉండేవాళ్లు అదేరీతిలో ఉండిపోతున్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సాయం పెంచాల్సి ఉంది. లేకపోతే సామాన్యుల బతుకులు 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉండిపోనున్నాయి.

పిక్క కూడా అదే స్థాయిలో

నిర్మాణంలో శ్లాబ్ వేయడానికి క్వారీల నుంచి పిక్క కొనుగోలు చేస్తారు. ఇటీవల వరకు యూనిట్ రూ.2,500 నుంచి రూ.3 వేల మధ్య లభించేది. ఇప్పుడు దీని ధర కూడా పెరుగుతుందని క్వారీ యజమానులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక లాగే క్వారీలను కూడా గుత్తగా కొందరికి కాంట్రాక్ట్‌కు ఇవ్వడానికి నిర్ణయించిందని, ఆ ప్రక్రియ పూర్తయి, కొత్త యాజమాన్యాలు వస్తే...ఇసుకలాగే పిక్క రేటు కూడా 30 నుంచి 50 శాతం పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకపక్క ఇసుక ధర,మరోపక్క సామగ్రి ధరలు పెరగడంతో సొంత ఇంటి కళ ...కల లాగే మిగిలే పరిస్థితి ఏర్పడింది.

బడ్జెట్ తలకిందులైంది

పాత ఇంటిని కూల్చివేసి, బ్యాంకు రుణంతో కొత్త ఇంటి నిర్మాణం ప్రారంభించా. బడ్జెట్ ప్రకారం రూ.25 లక్షలతో కింద ఒక పోర్షన్, పైన మరో పోర్షన్ వేయాలని అనుకున్నా. కానీ ఆరు నెలల్లోనే రేట్లు అన్నీ పెరిగిపోవడంతో బడ్జెట్ తలకిందులైంది. అదనంగా మరో రూ.10 లక్షలు సమకూర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. బ్యాంకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా...నేను దానిని నెలనెలా చెల్లించే స్థితిలో లేను. అందుకే ముందు కింద పోర్షన్ పూర్తిచేయాలని నిర్ణయించి, పై పోర్షన్ నిర్మాణం నిలిపివేశాను.

- గెడ్డం బాలశేఖర్, శివకోడు



ఆసుపత్రిలో మృతి చెందిన కారదాల చంద్రరావు

ఉలికి పడిన వేట్లపాలెం..

- స్థల వివాదంతో ప్రత్యర్థులపై దాడి
- ముగ్గురు హతం, పలువురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - సామర్లకోట

కత్తులు, కర్రలతో ఒక్కసారిగా చేసిన దాడిలో ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆదివారం రాత్రి సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన ఈ సంఘటన జిల్లాను ఉలికిపాటుకు గురిచేసింది.

వేట్లపాలెం గ్రామ శివారులోని దళితపేటకు చెందిన చెరువును గ్రామానికి చెందిన కారదాల కుటుంబీకులు ఆక్రమించి గృహాన్ని నిర్మిస్తున్నారని అదే గ్రామానికి చెందిన బచ్చల కుటుంబ సభ్యులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. గత 3 నెలలుగా ఈ వివాదం రెండు కుటుంబాల మధ్య సాగుతోంది. ఆదివారం రాత్రి కారదాల కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణానికి సంబంధించి స్లాబ్ పనులు చేస్తుండగా బచ్చల కుటుంబానికి చెందిన వ్యక్తులు కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లతో ఒక్కసారిగా కారదాల కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కారదాల ప్రకాశ రావు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కారదాల చంద్రరావు(60) సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. కారదాల యేసుబాబు(45) కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో దుర్మరణం చెందాడు. ప్రత్యర్థుల దాడిలో గాయపడిన కారదాల పండు, కారదాల దావీదు, కారదాల బాబి, కారదాల చిన్నోడు, కారదాల సత్యవేణి, కారదాల అచ్చయ్య, కారదాల సంజీవరావు తదితర ఏడుగురు చికిత్స పొందుతున్నారు. బచ్చల సుబ్బారావు మరో అయిదుగురు తమపై దాడికి దిగారని మృతుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్లాబ్ నిర్మాణం పనుల్లో నిమగ్నమై ఉన్న తమ కుటుంబ సభ్యులను రాత్రి 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా బచ్చల కుటుం బీకులు దాడి చేశారని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ దర్యాప్తు ప్రారంభించారు. మతుల బంధువుల నుంచి వివరాలు సేకరించారు. రాత్రి పదిన్నర గంటలకు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వేట్లపాలెంలోని సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు.



రోధిస్తున్న కుటుంబ సభ్యులు



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

అమరజీవికి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని జిల్లాలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు తదితర చోట్ల జరిగిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అమలాపురం: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి నాంది పలికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కై ఆమరణ నిరాహార దీక్ష నిర్వహించి ప్రాణత్యాగం, అత్మార్పణ చేసిన అమర జీవిగా పొట్టి శ్రీరాములు కీర్తించబడ్డారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలి పారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టీవీ ప్రసాద్, వికాస జిల్లా మేనేజ ర్ జి రమేష్ , కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీ కృష్ణ సిబ్బంది రవికిరణ్, భరత్, వెనుకబడిన తరగతుల వసతి గహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అమరుడై చరిత్రలో నిలిచి పోయారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పొట్టి శ్రీరాములు 72 వ వర్ధంతి సందర్భంగా పట్టణం లోని ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఈ కార్యక్రమలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** గ్రామాల్లో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహిం చారు. అంగరలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక జనసేన నాయకులు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగర సాగు నీటి సంఘం ప్రెసిడెంట్ కొమ్ము శెట్టి సూరిబాబు, పిల్లా బసవరాజు, అంగర గ్రామ ఉపా ధ్యక్షులు తోరాటి శ్రీను,దానేటి శరత్, చీకట్ల గంగరాజు తదితరులు, పాల్గొన్నారు. **ఆలమూరు:** ఆంధ్రులకు స్వరాష్ట్రం కావాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేసి, తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని కూటమి నాయకులు వ్యాఖ్యానించారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆలమూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి సభ మండల కేంద్రంలో నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన త్యాగాలను గుర్తుచేసుకుని ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెత్సా సత్తిబాబు, సబ్బిశెట్టి రాంబాబు, బొడ్డు గుప్తా, దొడ్డి రాంబాబు, వెత్సా నానాజీ, కూటమి నాయకులు వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరవు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్‌తో కలసి రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరవు అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాళ్ళకూరి గొల్లబాబు, పలువురు ఛాంబర్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద మంత్రి సుభాష్ నివాళి



ఆలమూరులో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద పలువురి నివాళి



నివాళులు అర్పిస్తున్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల తదితరులు

సాగునీటి సంఘాల అధ్యక్షులకు అభినందన



పలివెలలో జగన్నాథంను అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఈ నెల 14న సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షులను, సభ్యులకు ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు అభినందనలు తెలిపారు. ఎన్నికైన అధ్యక్షులను సన్మానించారు.

కొత్తపేట: ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నీటి సంఘం అధ్యక్షులు చవల జగన్నాథం, బండారు వీరబాబులకు పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందలు తెలిపారు ఈ కార్యక్రమంలో వాడపాలెం గ్రామ సర్పంచ్ త్సామ బాబు, మాజీ ఉప సర్పంచ్ పప్పుల కొత్తయ్య, మండల తెలుగురైతు అధ్యక్షులు చోడపనీడి భాష్కరరావు, టౌన్ ప్రెసిడెంట్ వాసంశెట్టి సత్యనారాయణ, వార్డు సభ్యుడు కాశి రాజు, రుషి విష్ణు, శీలం సూర్యచంద్రరావు, రొట్టా రమణ, టి.సీతారామరాజు, వాసంశెట్టి చంద్రరావు, సలాది అంజిబాబు, నారాయణ, పాలంగి శ్రీను తదితరులు అభినందలు తెలిపారు **మామిడికుదురు:** మానేపల్లి నీటి సంఘం ఛైర్మన్ గా మద్దాల తమన్న, వైస్ చైర్మన్‌గా గిడుగు రారాజు, ఎన్నికయ్యారు. సభ్యులుగా గ్రంధి చిరంజీవి, గోగి గిరిబాబు, కడలి బాబురావు, తాటికాయలు ఉదయ భాస్కర్, మద్దుల సత్యనారాయణ, పితాని వెంకటేశ్వరరావు, పెదమల్లు రామకష్ణ, బండారు సరయ్య, అడబాల వెంకటేశ్వరరావు, పత్తిపాటి మాణిక్యం శాఖకు ఎన్నికయ్యారు. వీరిని ఆదివారం ఉమ్మడి కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, బోణం సత్య నాగేశ్వరరావు, తుండూరి బుజ్జి, పి గన్నవరం నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల రామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** సాగు నీటి సంఘాలను అభివద్ధి పథంలో నడిపే విధంగా నూతన కార్యవర్గం కషి చేయాలని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సూచించారు. సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో ముమ్మిడివరం నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సరిపెళ్ల శ్రీనివాస రాజు, బొబ్బిలి ఈశ్వర రావు ఆదివారం మురమళ్ల లోని ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం నందు ఎంఎల్ఎ సుబ్బరాజు ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుబ్బరాజు కొత్తగా ఎన్నికైన శ్రీనివాస రాజు ఈశ్వర రావులను అభినందించారు. నీటి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అం దించాలని సూచించారు. అదే విధంగా శానపల్లి లంక నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గుద్దటి జమ్మి ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో దాట్ల పథ్వీ రాజ్, దొమ్మేటి రమణ కుమార్, గొల్లపల్లి గోపి, బొబ్బిలి భారత్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



మానేపల్లి నీటి సంఘం సభ్యులకు సన్మానం



ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును కలిసిన నీటి సంఘాల సభ్యులు

మృతుల కుటుంబాలకు పలువురి పరామర్శ



మృతుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బోస్

ప్రజాశక్తి - యంత్రాంగం

పలు చోట్ల ఇటీవల మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పరామర్శించారు.

రామచంద్రపురం: వియస్ఎం కళాశాల రిటైర్డ్ ఉపాధ్యాయులు కడియాల సత్యనారాయణ చౌదరి ఇటీవల మృతి చెందారు. ఆయన కుమారుడు, పట్టణ టిడిపి అధ్యక్షుడు కడియాల రాఘవన్‌ను, వారి కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆదివారం పరామర్శించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతికి రాజ్యసభ ఎంపీ బోస్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం రాఘవన్ కలిసి ఆయన మాట్లాడారు ఆయన వెంట మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఇంత సంతోషం , బిసి సంఘం నాయకులు శీలం గంగరాజు తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** ఏడిద గ్రామంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. నూకల చంద్రరావు, తాతపూడి నాగరాజు, విత్తనాల చంటమ్మల కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంఎల్ఎ వెంట గ్రామ టిడిపి నాయకులు పర్వతిన వీర్రాజు, గుడాల కోటబాబు, బలుసు శ్రీనివాసు, ముగ్గుళ్ళ కాళికృష్ణ, పెంటపాటి గణపతి, పెద శ్యామ్, చిన శ్యామ్, పైడిమల్ల రాణా తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు ఉప్పలగుప్తంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిక్కం సూర్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఆదివారం పలువురు పరామర్శిం చారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన కుమారుడు జనసేన నాయకుడు సూర్య మోహన్‌ను కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ జడ్‌పిటిసి, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గెడ్డం సురేష్ బాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చీకట్ల ఏసుబాబు, జనసేన నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మంచెం బాలకష్ణ, కంకిపాటి వీరబాబు, తదితరులు ఉన్నారు.



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నాయకుల నివాళి




మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ

నేడు యథావిధిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈనెల 16 సోమవారం ఉదయం 10 గంటలనుండి యథావిధిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో జరుగునని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా బూ యంత్రాంగం దష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితోపాటు డివిజన్, మండల స్థాయిలో కూడా ఈకార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

కార్టూ'నిజం'



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మృతుని కుటుంబానికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ ఆదివారం ఆర్థిక సాయం అందజేసింది. నడిపూడి గ్రామంలో బొక్కా వారిపాలెం నిరుపేద కుటుంబానికి చెందిన కొప్పిశెట్టి నాగేంద్రరావు బ్రెయిన్ స్ట్రోక్ వలన చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. నడిపూడి బొక్కావారిపాలెం పెద్దలు, యూత్ సభ్యులు అందరూ కలిసి మృతుడి కుటుంబ పరిస్థితిని శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ గ్రూపు సభ్యులకు తెలియజేశారు. స్పందించిన శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ గ్రూపు సభ్యులు, శెట్టిబలిజ సామాజిక వర్గీయులు, పెద్దలు చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, సంసాని బుల్లి నాని నాగేంద్రరావు కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో నగదు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ రూ.లక్ష, హైదరాబాద్ జిఎంకె చారిటబుల్ ట్రస్ట్ రూ.25 వేలు, బొక్కావారిపాలెం గ్రామస్తులు రూ.25 వేలు, బొక్కా సత్యనారాయణ రూ.10 వేలు నగదును సమ కూర్చారన్నారు. మృతుడు నాగేంద్రరావు కుమారుడు సాయిబాబు కుటుంబ సభ్యులకు ఆదివారం శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నడిపూడి సర్పంచ్ చెల్లిబోయిన నాని, నాయకులు జిఎంకే చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి పిల్లి నాగ గోపాలకష్ణ, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, గుబ్బల ప్రసాద్, విత్తనాల శేఖర్, బొక్కా ఆదినారాయణ, కేతాభాను తేజ తదితరులు పాల్గొన్నారు.



నాగేంద్రరావు కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న శెట్టిబలిజ నాయకులు

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గొల్లలగుంట గ్రామంలో ఆదివారం జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్కరకాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు నుంచి తాళ్లూరు వెళ్లే రహదారిలో పుష్కరకాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు(63) ఈ నెల 12వ తేదిన బహిర్భూమికి వెళ్లానని బయటికి వచ్చిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులను వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే పుష్కరకాలువలో మృతి చెందివున్నట్లు తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం

ప్రజాశక్తి - గండేపల్లి

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం సూరం పాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రౌండ్‌లో జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ వత్తిడితో జీవించే జర్నలిస్టులకు ఇలా క్రీడా పోటీలు ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని ఆయన కోరారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మాట్లాడుతూ గెలుపు, ఓటములు కొలబద్దగా కాకుండా స్నేహపూర్వక వాతావ రణంలో ఈ పోటీలు జరగాలని ఆకాంక్షించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పుడూ విధి నిర్వహణలో బిజీగా ఉంటారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఒక వేదికపై మీడియా తీసుకొచ్చి క్రీడలను ఆడటం ఆనందంగా ఉందన్నారు. ఆదిత్య యూనివర్సిటీ ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు కృష్ణవేణి, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులం ప్రసాద్, గౌరవ అధ్యక్షులు బోళ్ల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి తలారి నాగలింగస్వామి, గౌరవ సలహాదారు అజయ్ ఇండియన్, అసోసియేషన్ నాయకులు తలారి రెడ్డప్ప, డి.సాంబశివరావు, సిద్దు, లోవరాజు, సూరిబాబు, వెలుగూరి రవి, వెంకటరత్నం, రాజేంద్ర, వేణుగోపాల్, నాగవర్థన్ రెడ్డి, సురేంద్ర, కిషోర్, తదితరులు పాల్గొన్నారు. స్టేట్ -ఎ, ఈస్ట్ గోదావరి -బి, స్టేట్ -బి, ఈస్ట్ గోదావరి -ఎ జట్ల మధ్య పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విన్నర్స్ రాయల సీమ స్టేట్ బి రన్నర్స్ ఉభయగోదావరి జట్టు నిలిచాయి.

గిరిజన ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కిత్తమూరిపేట, పెద్దిపాలెం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు ముదునూరి మురళీకృష్ణంరాజు చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. రహదారుల సదుపాయం లేక గిరిజనులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పెద్దిపాలెం పిహెచ్‌సి గిరిజనులు వచ్చేందుకు అవసరమైన రహదారిని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవర లక్ష్మణ్, లోవరాజు, చంటి బాబులు, మేకా చంటి బాబు, విత్తనాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేవర్ష ఆసుపత్రి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గత కొన్ని సంవత్సరాలుగా ప్రత్తిపాడులో దేవర్ష ఆసుపత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం దేవర్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవర్ష ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అంజినాయక్, డాక్టర్ విజయ పట్టణాల్లో కార్పొరేట్ ఆసుపత్రిలో ఏవిధంగా సదుపాయాలు ఉన్నాయో అన్ని సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రత్తిపాడులో ప్రారంభించడం అభినందనీయమన్నారు. చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వాసులకు దూర ప్రాంతాలు వెళ్లకుండా దగ్గరలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేవర్ష ఆస్పత్రి అధినేతలు డాక్టర్ అంజి నాయక్, డాక్టర్ విజయ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత వాసులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతిథులను ఆసుపత్రి యాజమాన్యం సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల బాబుకి అభినందన

ప్రజాశక్తి - మండపేట

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు)ని ఆదివారం మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడలో జరిగిన ఆయన ప్రమాణ స్వీకార మహోత్సవంలో లీలాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల బాబును అభినందనలు తెలిపారు.

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - ఆలమూరు

వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. విపిపిఎస్ గ్రూపు అధ్యక్షులు మామిడిశెట్టి వెంకటరమణారావు, మండల గ్రూప్ అధ్యక్షులు సోము పోతురాజు, గ్రూప్ ఉపాధ్యక్షులు ద్వారంపూడి గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చొప్పెల్ల తక్షశిల స్కూల్ ఆవరణలో వికలాంగుల పరిరక్షణ సమితి ఏర్పాటు చేసిన వికలాంగుల అంతర్జాతీయ దినోత్సవ వారోత్సవాల వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వికలాంగులకు ప్రభుత్వం పెంచిన పింఛను, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, రైల్వే పాసులు, బ్యాక్లాగ్ పోస్టులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ట్రై సైకిల్ తదితర అంశాలపై వారితో చర్చించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు ఎవరికైనా కార్లు ఉంటే పింఛను తొలగించవద్దని, పుట్టుకతోనే పూర్తి వికలాంగులుగా ఉన్న వారిని గుర్తించి వారికి నూరు శాతం పెన్షన్ సదుపాయం కల్పించాలని వికలాంగులు ఎంఎల్ఎను కోరారు. అలాగే వికలాంగులు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఎంఎల్ఎకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ కూటమి ప్రభుత్వం మీకోసం ఎన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని, మీరు అడిగిన ప్రతి విషయాన్ని అసెంబ్లీలో చర్చిస్తానని తెలిపారు. అనంతరం ఆయన అర్హులకు మంజూరైన ట్రై సైకిల్స్, బస్సు పాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి.సత్యనారాయణరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, డిసి మాజీ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటరత్నం, కూటమి నేతలు సుఖమల్ల రాముడు, జాంపోలు వెంకట్రావు, బల్ల హరికృష్ణ, కొత్తపల్లి రామకృష్ణ, సిరంగులసతీష్, నాగిరెడ్డి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

గుంటూరు 'మహాగర్జన'కు తరలిన నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా నల్లపాడులో ఆదివారం నిర్వహించిన మాలల మహా గర్జనకు దళిత నాయకులు పెద్దఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు.

మామిడి కుదురు: సుప్రీం కోర్టు రాజ్యాంగ వ్యతిరేక ఎస్సి వర్గీకరణ, క్రిమిలేయర్, తీర్పులను వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా నల్లపాడులో నిర్వహిస్తున్న మాలల మహా గర్జన సభ బయలుదేరి వెళ్లే బస్సులను మామిడికుదురులో గొల్లపల్లి సూర్యారావు, డి సి సి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూపతి వెంకటపతి, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, కలిగిత పల్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, గేడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం: జిల్లాలో అమలాపురం నుంచి గుంటూరులోని నల్లపాడులో మాలల మహా గర్జనకు బస్సులు, కార్లలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో చింతా రామకష్ణ. జల్లి శ్రీను, కుంచె బాబులు, నాతి శ్రీనివాస్, ములపర్తి వెంకటేశ్వరరావు, కుంచె సిద్ధార్థ ప్రసాద్, మాకే వెంకటేశ్వరరావు తదితరులు వెళ్లారు.

ముమ్మిడివరం: ఎస్సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో జరిగే మాలల మహా గర్జన సభకు మాలమహానాడు నాయకులు, ఎస్సి ఉద్యోగులు, యువత అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గర్జన సభకు మండల మాల మహానాడు, ఎస్సి ఉద్యోగుల సంఘం నాయకుల అద్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులు, కార్ల లో మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తరలి వెళ్ళారు. తొలుత నగర పంచాయతీ చైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్ బుద్ధ పార్కు ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గుంటూరు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు కార్యకర్తలు ఎస్సి వర్గీకరణ వద్దు, ఐక్యతే ముద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాలమహానాడు నాయకుడు, ఉద్యోగుల సంఘం నాయకులు మట్టా శ్రీనివాసరావు జనిపల్లి బాలకృష్ణ, ఎం.ఆశీర్వాదం, జె.సత్యనారాయణ, జగపతి ఏడుకొండలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు, పడమర ఖండ్రిక గ్రామాల నుంచి చలో గుంటూరు మాలల మహా గర్జన సభ కార్యక్రమానికి దళిత సంఘం నాయకులు, యూత్ సభ్యులు, భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి విలేకరులతో మాట్లాడుతూ మాలలు ఐక్యత పరిష్కారానికై గుంటూరులో జరిగే మాలల గర్జన సభకు తరలి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాకా శ్రీను, నేల సూర్యకుమార్, కనికెళ్ళ శ్రీను, సాదే శ్రీను, వట్లూరి సుబ్బారావు, మద్దా రమేష్, మొసలి నాగభూషణం, మోర్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఎస్ సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరు నల్లపాడులో తలపెట్టిన మహాగర్జన సభకు మండలం నుంచి మాలలు బస్సులు, కార్లు ఇతర వాహనాలపై తరలి వెళ్లారు. మండల మాల మహానాడు నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, పొలమూరి మోహన్‌బాబు, కొంకి వెంకటబాబ్జి, కుంచే బాబులు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, రేవు తిరుపతిరావు, అయితాబత్తుల అజయ్ సింగ్ తదితరులు మహాగర్జనకు వెళ్లారు.



మామిడికుదురు నుంచి మహాగర్జన సభకు వెళుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి, డిసిసి అధ్యక్షుడు కొండేటి

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య అన్నారు. ఆదివారం మామిడికుదురు హైస్కూల్ ప్రాంగణంలో పిఆర్‌టియు అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యా సదస్సు, కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు దీపాటి సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఐఆర్30 శాతం ప్రకటించాలని, హిందీ, ఇంగ్లీష్ సిలబస్ తగ్గించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మైలవర్ అప్పు రవీంద్రనాథ్ విద్యా సదస్సు లో ప్రస్తుత విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్ల అంశం పై ప్రసంగించారు. అనంతరం పిఆర్‌టియు రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరాల కృష్ణ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ పంగంబ్రహ్మాజీరావు, మామిడి కుదురు మండల శాఖ అధ్యక్షులు యాల పల్లంరాజు, మండల కార్యదర్శి చింతా రమేష్, మండల ఆర్థిక కార్యదర్శి కడలి వెంకట దుర్గాప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి 2. మోకా వెంకన్నబాబు, హై స్కూల్ హెచ్ఎం సి హెచ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు.



పిఆర్‌టియు కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

700 మందికి చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

వికలాంగులు, వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, చీరలను సాయి ట్రస్ట్ విశాఖపట్నం వారు పంపిణీ చేశారు. ట్రస్ట్ 15వ వార్షికోత్సవం సందర్భంగా సత్య సాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ విశాఖపట్నంకు చెందిన శివకోటి మధుసూదనరావు ఆధ్వర్యంలో ద్రాక్షారామంలో ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భీమేశ్వర స్వామి అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 700 మంది వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు సుమారు రూ.3లక్షలు విలువైన చీరలు, దుప్పట్లు అందజేశారు. వారికి భోజనం, ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం డిసెంబర్ నెలలో తమ బృందం 50మంది సభ్యులతో కలిసి విశాఖ నుంచి ద్రాక్షారామ వచ్చి పేదవారికి తాము సేవ చేస్తున్నామని తెలిపారు. మా సంస్థ వారు విశాఖపట్నంలో కెజిహెచ్ వద్ద ప్రతి రోజూ 500 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నేటికి 15 సంవత్సరాలు నుంచి నిరంతరంగా మా బృందం ద్రాక్షారామ వచ్చి పేద వారికి ఉచితంగా దుస్తులు, భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాట్ల అప్పారావు, దాడి భాస్కర్, పి.శ్రీనివాస్, జె.చంద్రశేఖర్, ఐ.రవికిరణ్, బి.శ్రీకాంత్, ఎస్‌విఆర్ రాజు, మైనార్టీ బిసి సంఘ నాయకులు యాట్ల నాగేశ్వరరావు, రోజా రాణి, తదితరులు పాల్గొన్నారు.



విశాఖ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

జీడిపిక్కల కార్మికులకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులకు వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆది వారం మద్దతు ప్రకటించారు. ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహి స్తున్న కార్మికులకు వద్దకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్ర మౌళి పద్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తమ కార్యకర్తలతో చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కల ఫ్యాక్టరీ కార్మికులు గత నెల రోజులుగా పోరాడుతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోక పోవడం దారుణమ న్నారు. తక్షణమే ఫ్యాక్టరీ తెరిపిం చి 409 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు కార్మికులకు మద్దతుగా రోడ్డుపై కి వస్తారని హెచ్చరించారు. యాజమాన్యం తమ స్వార్థ ప్రయోజ నాల కోసం ఫ్యాక్టరీని మూసివేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పార్వతి, సిహెచ్.సత్య, కార్మిక నాయకులు ఎ వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, ఆది, కృష్ణారావు, శివ దుర్గాప్రసాద్, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, దేవి, చంటి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విధులపై అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - శంఖవరం

దేవస్థానంలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు విధులు పట్ల అలసత్వం వహిస్తే ఖఠిన చర్యలు తీసుకుంటానని అన్నవరం దేవస్థానం కార్య నిర్వహణఅధికారి వీర్ల సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ని విభాగాలు ఉన్నాయి? ఏ విభాగాల్లో పాలన, అభివృద్ధి, ఆదాయం అంశాలపై ఆయన ఆరా తీశారు. ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించిన నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. లీజులు విభాగంలో ల్యాండ్స్, బకాయిల గురించి అడిగి తెలుసు కున్నారు. అవినీతి అక్రమాలకు ఏ ఉద్యోగి పాల్పడిన క్రమశిక్షణ చర్యలు కఠినంగా ఉంటాయని, దానిని దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులు పనిచేయాలని ఆయన హెచ్చరిం చారు. ఈ సమావేశంలో డిసి చంద్రశేఖర్, ఎసి రామ్మోహనరావు, ఎఇఒలు, పర్యవేక్షణ అధికారులు, పిఆర్ఒ కొండల్ రావు పాల్గొన్నారు.

7వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 7వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో యూనియన్ అధ్య క్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీ రింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షలు, వైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల న్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభు త్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరా రు. ఈ సమ్మె శిబిరంలో నాగేశ్వరరావు, రమణ, రామ కృష్ణ, స్వామి, భాస్కర్, భద్రరావు, సాయి కృష్ణ, జి.నాగేశ్వరరావు, ఎస్.కె బషీర్, శివ, ఎం.భద్ర రావు, రవిచంద్రకుమార్, సతీష్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో ఉచిత సేవలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో ఏలేశ్వరం లయన్స్ క్లబ్, కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 200 మంది రోగులకు సేవలు అందిం చారు. ఈ శిబిరాన్ని ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షులు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యులు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, కిరణ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అవని, డాక్టర్ వెంకట అనూష వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్ళజోళ్ళు అందజేశారు. వీరిలో 30 మందికి ఐఒఎల్ ఆపరేషన్ నిమిత్తం కాకినాడ కిరణ్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, కప్పల నాగభూషణం, గొల్లపూడి గణేష్, జామి సూర్యప్రకాష్, తాండూరి రాము, తాళ్లూరి గొల్లాజీరావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఇరిగేషన్ ఈస్ట్రన్ డివిజన్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన 11 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పేర్కొంది. వికాస్ ద్వారా ఔట్‌సోర్సింగ్‌లో చేరి రూ.10,500లకు 11 ఏళ్ల నుంచి 200 మంది పని చేస్తున్నారని అన్నారు. వారిని ప్రభుత్వ సర్వీసులోకి చేర్చేందుకు తగిన క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే వారికి చెల్లించాల్సిన 11నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ చిత్రం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన ఇండియన్ గ్రాండ్ మాస్టర్ డి.గుకేష్ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. ఈ మేరకు ఆదివారం ఆయన గుకేష్ చిత్రపటాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారు. తెలుగు తేజం దొమ్మరాజు గుకేష్ కేవలం 18 ఏళ్లకే ప్రపంచంలో అత్యంత పిన్న వయస్సు లో ప్రపంచ చెస్ ఛాంపియన్ గా అవతరించి సింగపూర్ లో చరిత్ర సృష్టించి ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గా నిలిచారు. రాబోయే దశాబ్దాలలో మరెన్నో విజయాలు సాధించి భారతదేశ ఖ్యాతిని మరింత పెంచాలని, అందరి ప్రశంసలు పొందాలని ఇండియన్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ కు నా చిత్రాభినందన అంటున్నారు. ఈ చిత్రం అందరిని ఆకట్టుకుంది.



గుకేష్ చిత్రం

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

మండపేటలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణపనులను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరితిగతిన నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు, నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట్లాడాలని ఇద్దరు నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వేరు వేరు పార్టీల్లో వారైనా ఆసుపత్రి నిర్మాణానికి వారు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

నియోజక వర్గం స్థాయిలో నేడు నేడు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని పిఠాపురంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిఠాపురంలో జరిగే సమావేశంలో తనతోపాటు, వివిధ శాఖలకు చెందిన జిల్లా దిగువ స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొంటారని అన్నారు. ఉదయం 9.30 నిమిషాలకు పిఠాపురం రథాలు పేట అంబే ద్కర్ కమ్యునిటి హాలులో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో, మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమం ఉదయం10 గంటల నుంచి 1 గంట వరకు యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

కెఎఫ్‌సిఎల్ చెక్‌పోస్టులో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ 2వ గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆదివారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కెఎఫ్‌సిఎల్ పోర్టులో ఉన్న ఉషశ్రీ ట్రేడర్స్‌కు చెందిన స్టఫ్డ్ రైస్ కంటైనర్ల నుంచి చెక్ పోస్ట్ టీమ్‌తో నమూనాలు సేకరించి పరీక్షలు చేయించారు. ఈ నమూనాల పరీక్షలలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ లేనందున కంటైనర్లలోని బియ్యం పిడిఎస్ బియ్యం కావని నిర్ధారించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల భద్రత నిమిత్తం ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అక్రమ ఎగమతులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు పటిష్టంగా నిర్వహించేందుకు ఇటీవల నూతనంగా మరోక చెక్ పోస్టును కెఎఫ్‌సిఎల్ వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చెక్ పోస్ట్ ల వద్ద సుశిక్షుతులైన సిబ్బంది తనిఖీలు నిర్వహించిన అనంతరం వాహనాలకు గేట్ పాస్ ద్వారా అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు మూడు షిఫ్ట్ లలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలకు చెందిన అధికారులతో కూడిన బృందం తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. అనుమానిత నమూనాలను విశ్లేషణ నిమిత్తం పౌరసరఫరాల శాఖ జిల్లా ల్యాబ్ కు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి రఘువీర్ విష్ణు, జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌ఛార్జ్ అధికారి ప్రసన్న లక్ష్మీదేవి, పోర్టు అధికారులు, పౌర సరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాల ఏర్పాటుకు ఆసక్తి

ప్రజాశక్తి - తొండంగి

మినీ గోకులాలు ఏర్పాటు చేసుకునే పథకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారని శృంగవృక్షం పశు వైద్యాధికారి నరసింహం అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన సెక్టార్‌కి 8 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని, వాటిలో శృంగవృక్షం, కొమ్మనాపల్లి, ఎ.కొత్తపల్లి, అగ్రహారం, సీతారాంపురం గ్రామాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి సామాజికవర్గాలకు చెందిన రైతుల ను ఎంపిక చేశామన్నారు. లబ్ధిదారుడు స్థలాన్ని బట్టి 6 గాని 8 పశువులతో పాటు, రేకుల షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఎవ రైనా రైతులు 10 సెంట్లు నుంచి 5 ఎకరాలు స్థలంలో గడ్డిని పెంచేందుకు ప్రభు త్వం సహకారం అందిస్తుందన్నారు. అంతేగాక పెంచిన గడ్డిని కొనుగోలు చేస్తుం దని, ఆసక్తిగల రైతులు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి-గోపాలపురం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.లక్షల విలువైన సామగ్రి దగ్ధమైన సంఘటన గోపాలపురంలోని ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోపాల పురంలోని పెద్దగూడెంలో పాస్టర్ ఏలేటి భూషణంకు చెందిన ఇంట్లో మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారికి మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాదం జరిగిన సమయంలో పాస్టర్ కుటుంబ సభ్యులు ప్రార్థనా మందిరానికి వెళ్లినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి ఎసి, ఫ్రిజ్, సెల్ ఫోన్లు, ఫ్యాన్లు టివిలు, ఇంటి వైరింగ్ సహా పలు రకాల విలువైన సామగ్రి పూర్తిగా దగ్ధం అయ్యాయని తెలిపారు. విఆర్ఓ శ్రీనివాస్ ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు.

పాఠశాల ప్రారంభ సమయానికి ముందే హాజరవ్వాలి

ప్రజాశక్తి - అమలాపురం

పాఠశాల ప్రారంభ సమయానికి కనీసం ఐదు నిమిషాల ముందు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని డిఇఒ షేక్ సలీం భాష ఆదివారం ఒక ప్రకటన కోరారు. పాఠశాల పూర్తి అయిన తరువాత విద్యార్థులందరూ పాఠశాల నుండి వెళ్లినట్లు నిర్ధారించుకున్న తరువాతే ఉపాధ్యాయులు పాఠశాలను విడిచి వెళ్లాలని డిఇఒ తెలిపారు. ప్రతి రోజూ పాఠశాల అసెంబ్లీలో ఖాళీ పీరియడ్లలో విద్యార్థులకు నైతిక విలువలపై ఉపన్యాసాలు ఇవ్వాలన్నారు. విద్యార్థి ఒకసారి పాఠశాలకు హాజరైన తరువాత తల్లి లేదా తండ్రి వచ్చినప్పుడే బయటికి పంపించాలన్నారు. ఆరోగ్య సమస్యల కోసం, సమస్య వచ్చిన వెంటనే సమీప ఆసుపత్రి తీసుకెళ్లడం బాధ్యతగా భావించాలని అన్నారు. గ్రంథాలయపు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసి చదవడానికి ప్రోత్సహించాలనీ ముఖ్యంగా నైతిక విలువల పుస్తకాలు అందించాలని కోరారు. విద్యార్థులు ప్రతిరోజూ యూనిఫారం షూస్, ధరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రీడా పరికరాలను వినియోగించి, నైపుణ్యం ఉన్న విద్యార్థులను గుర్తించి ఆటల పోటీలకు ప్రోత్సహించాలన్నారు. సైన్స్ ల్యాబ్, మ్యాథ్స్ ల్యాబ్, పాల్ ల్యాబ్, ఎటిఎల్ ల్యాబ్‌లను విద్యార్థులకు ఉపయోగకరంగా మార్చడం ప్రధాన లక్ష్యం కావాలన్నారు. పాఠశాలలో కిచెన్ షెడ్, టాయిలెట్స్, క్లాస్ రూమ్స్ పరిశుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ సూచనలను విధిగా పాటించి, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని డిఇఒ కోరారు.